క్లుప్తంగా

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర



వెంగాపురంలో ఎల్లమ్మ జాతర వేడుకను నిర్వహిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని వెంగాపురంలో రేణుకా ఎల్లమ్మ జాతర వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో సంప్రదాయం ప్రకారం అమ్మవారిని కొలిచి గ్రామ సమీపంలో ఉండే గుండాం వద్దకు వెళ్లి అక్కడ పూజలు చేశారు. అమ్మవారిని కొలిచే కార్యక్రమంలో భాగంగా తాళమేళాలతో కుటుంబాలతో సహా అక్కడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



డీవీఈఓ మంజుల వీణకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురంటౌన్: పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డీవీఈఓ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులా వీణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సీసీ కెమెరాల నిఘాపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు నోటీస్ బోర్డు ద్వారా సమాచారాన్ని తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ముద్దాయికి రెండేళ్ల కారాగార శిక్ష

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన బందలుప్పి రాము హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ ముద్దాయి రాముకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500లు జరీమానా విధించినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణపల్లి గ్రామానికి చెందిన మీనక ప్రభాకర్ ఫిర్యాదు మేరకు బందలుప్పి రాము భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తేదీ19.5.2022న ప్రభాకర్ గంగులమ్మ కళ్లం వద్ద సేదదీరుతుండగా అకస్మాత్తుగా రాము వచ్చి ప్రభాకర్ తలపై గాజు సీసాతో గాయపరిచి, పగిలిన సీసా ముక్కతో పొడవడానికి ప్రయత్నించగా, ఫిర్యాదుదారు అడ్డుకోగా మోకాలిభాగంలో పగిలిన గాజు సీసా ముక్క తగిలి గాయమైంది. ఈ మేరకు పార్వతీపురం రూరల్ పోలీసులకు తనపై రాము హత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రభాకర్ ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్సై కేసు నమోదు చేశారు. కోర్టులో ప్రాసిక్యూటర్ ఎం.జగన్నాథం పూర్తి ఆధారాలతో కేసు రుజువు చేయడంతో ముద్దాయి రాముకు పై విధంగా శిక్ష విధించారు.

కౌలురైతులకు శాపం భూధార్

- భవిష్యత్తులో పథకాల లబ్ధి, రుణాలన్నీ యజమానులకే
- కౌలుదారుల గుర్తింపునకు గండి



భూధార్ నమోదు ప్రక్రియ చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: భూధార్ కౌలు రైతుల పాలిట శాపంగా మారనుంది. ఈ విధానంతో కౌలు రైతుకు తీరని నష్టం వాటిల్లనుంది. వాస్తవ సాగుదారుల సంక్షేమం కోసం రాష్ట్రం చేసిన చట్టాలు నిర్వీర్యమవుతాయన్న అనుమానం కౌలుదారుల్లో నెలకొంది. ఈ చట్టాల వల్ల నామమాత్రంగా దక్కుతున్న గుర్తింపునకు భూధార్ కార్డులు మరింత గండి కొట్టనున్నాయి.

● కౌలు రైతుల గగ్గోలు

సొంత భూమి గల భూ యజమానులకు 11అంకెల గల విశిష్ట సంఖ్యతో భూధార్ కార్డులను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై అమలు చేసింది. ఈ కార్డులను పీఎం కిసాన్, ఫసల్ బీమా వంటి ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల వంటి పరపతి సౌకర్యాలకు భూధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కౌలు రైతుల గుర్తింపు, పంట రుణాల సమస్య మళ్లీ మొదటికి రానుంది. రాష్ట్రప్రభుత్వాలు చేసిన వివిధ చట్టాలు, పద్ధతుల ద్వారా అరకొరగా బ్యాంకు రుణాలు అందుతున్నాయి. ఈ చట్టాలను మరింత సరళతరం చేసి ఇతోధికంగా బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూధార్ వల్ల కౌలు రైతులకు తీరని నష్టం కలిగే పరిస్థితులు ఉన్నాయని కౌలురైతుల సంఘాలు గోలపెడుతున్నాయి. భవిష్యత్తులో భూధార్ కలిగిన రైతులకు పంట రుణాలు, పీఎం కిసాన్, బీమా సదుపాయాలు అమలయ్యే అవకాశాలుండడంతో రాష్ట్రప్రభుత్వాలు చేస్తున్న చట్టాలతో జారీచేసిన కౌలు రైతుదారుల గుర్తింపు కార్డుల చెల్లుబాటు ప్రశ్నార్థకంగా మారనుందని కౌలు రైతులు లబోదిబోమంటున్నారు.

● భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు

భవిష్యత్తులో భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలివ్వాలని రిజర్వ్‌బ్యాంకు బ్యాంకులకు ఆదేశిలిచ్చిన విషయం విదితమే. గతంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు చట్టం మేరకు ఇచ్చిన కౌలు రైతు కార్డులకు అరకొరగా బ్యాంకులు రుణాలిచ్చేవి. బ్యాంకులు ఇప్పుడు తాజాగా వచ్చిన ఆర్బీఐ ఆదేశాలతో కౌలు రైతులకు రుణాలు అందని ద్రాక్షగా మారనున్నాయి. కూటమి సర్కార్ కౌలు రైతులకు మేలు చేసేలా చట్టం తీసుకుని వస్తామని ఇచ్చిన హామీ ప్రకారం చట్టం చేస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతులకు అన్యాయం

ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూధార్ నమోదు ప్రక్రియతో కౌలు రైతులకు అన్యాయం జరుగుతుంది. భూయజమానులకు సంబంధించి మాత్రమే పక్కాగా నమోదైతే కౌలురైతు సంగతేంటి అనేది ప్రశ్నార్థకం. కౌలు పత్రాలు ఎందుకో మరి అర్థం కావడం లేదు.

– గౌరునాయుడు, కౌలురైతు, పదమాయవలస

హడావుడిగా విశిష్ట సంఖ్య నమోదుకు చర్యలు

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి, 24న పీఎం కిసాన్ మూడో విడత నిధులు విడుదల చేసేముందు భూయాజమానికి విశిష్ట సంఖ్య జారీ చేయాలని ఆదేశించడంతో వ్యవసాయ శాఖ ఆగమేఘాలపై చర్యలు చేపట్టింది. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ అసిస్టెంట్ వద్దకు భూ యజమాని తన ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు అనుసంధానం చేసిన మొబైల్ నంబర్ తీసుకువెళ్తుండగా రిజిస్ట్రీలో ఓనర్‌షిప్‌ను నిర్ధారించి 11అంకెల నంబర్‌ను కేటాయిస్తున్నారు. ఈ నంబర్ కేటాయింపులో సాంకేతిక సమస్యలు తలెత్తితే రెవెన్యూశాఖ రికార్డులను సరిచూపి వారికి నంబర్‌ను కేటాయిస్తారు. ఆర్ఎస్‌కే వ్యవసాయశాఖ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో రికార్డులను నమోదు చేసే తరుణంలో 80శాతం చూపితే వెంటనే నంబర్ వచ్చేది. వారు చూపిన పత్రాలలో తేడాలుంటే వీఆర్వో పరిశీలించాలి. ఇంకా తేడా కనిపిస్తే తహసీల్దార్ పరిశీలనకు వెళ్తుంది.

గోశాలలో మౌలిక వసతుల కల్పన

- ముందుకు వచ్చిన ఔత్సాహికుడికి కలెక్టర్ అభినందనలు

పార్వతీపురంటౌన్:

తోటపల్లి ఆలయం దగ్గరలో మంజూరైన గోశాలలో మౌలిక వసతులు కల్పనకు పార్వతీపురం పట్టణానికి చెందిన గోకవరపు శ్రీనివాసరావు ముందుకువచ్చారు. నాలుగు ఎకరాల స్థలంలో గోశాల మంజూరైన సంగతి తెలిసిందే. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూ.50లక్షలతో నిర్మాణం చేయనున్నారు. గోశాలకు ప్రహరీ, బోరు తదితర మౌలిక వసతుల కల్పనకు శ్రీనివాసరావు ముందుకువచ్చారు. ఈ పనులు చేపట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని శ్రీనివాసరావు చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆయనను అభినందించారు. మూగ జీవాల రక్షణకు ముందుకు రావడం ముదావహమన్నారు.



శ్రీనివాసరావును అభినంధిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవా ట్రస్ట్ కార్యనిర్వహక ట్రస్టీ డి.పారినాయుడు, కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

తగ్గిన చోడి విస్తీర్ణం

పార్వతీపురం:

మండలంలోని చినబొండపల్లి, సంగంవలస, చినమరికి, బందలుప్పి తదితర గ్రామాలలో సుమారు ఐదు ఎకరాల్లో చోడి (రాగులు)పంటను పండిస్తున్నారు. గతంలో 40 ఎకరాల వరకు పండించే ఈ పంట ప్రస్తుతం పండించేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. గతంలో ఇంటిల్లి పాది చోడితో తయారుచేసిన వంటకాలను ఆరగించేవారు. ప్రస్తుతం గ్రామాలలో చోడితో తయారుచేసిన వంటకాలను తినేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఈ పంటను పండించేవారు నానాటికీ తగ్గిపోతున్నారు. తక్కువ వ్యయంతో ఈ పంటను పండించే అవకాశాలున్నప్పటికీ మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో రైతులు ముందుకు రావడంలేదు. పలు ఆరోగ్య సమస్యలున్న వారు రాగులను ఆహార పదార్థంగా వైద్యుల సూచనలమేరకు వాడుతున్నప్పటికీ పండించేందుకు రైతులు ముందుకు రావడంలేదు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు రాగులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అధికారులు స్పందించి రాగుల పంటను ప్రోత్సహించేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే పంటను మరింత మంది పండించేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



బందలుప్పిలో పండిస్తున్న చోడిపంట

మార్చి 24,25న బ్యాంకుల బంద్



తమ డిమాండ్లు తెలియజేస్తున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సాలూరు:

తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24,25న జాతీయస్థాయిలో బ్యాంకుల బంద్ చేపడుతున్నట్లు ఎస్‌బీఐ అధికారులు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం బ్యాంకు బయట నిరసన తెలుపుతూ డిమాండ్లు ప్రకటించారు. యూఎఫ్‌బీయూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఈ నెల 3న పార్లమెంట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ కార్యదర్శి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన కరెంట్ పోల్ దొంగ

సాలూరు రూరల్: మండలంలోని దిగువమెంటి ఘాట్ రోడ్డు వద్ద విరిగి ఉన్న ఐరన్ కరెంట్ పోల్‌ను బొడ్డవలసకు చెందిన ఆటో డ్రైవర్ మహేష్ దొంగిలించి ఆటోలో తరలిస్తుండగా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. ఈ మేరకు గంగన్నదొర వలస కూడలి వద్ద ఆటో డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరసింహమూర్తి నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

అప్రజాస్వామ్య పాలన ఎండగడదాం



మాజీ డిప్యూటీ సీఎం డికరాజన్నదొరను కలిసిన వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గం వివిధ విభాగాల ప్రెసిడెంట్‌లు, నాయకులు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అందరం సమష్టిగా ఉంటూ ప్రజల్లోకి వెళ్దామని, ఈ టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలన క్షేత్రస్థాయిలో ఎండగడదామని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఇటీవల సాలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున వివిధ విభాగాల ప్రెసిడెంట్‌లు నియామకమైన నేపథ్యంలో వారంతా శుక్రవారం రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు.

తమపై ఎంతో నమ్మకంతో ఉంచిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాజన్నదొరకు, వైఎస్సార్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలకు వారంతా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, దుశ్శాలువాలతో రాజన్నదొరను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెకెండ్‌ఫేజ్ 'రీ'సర్వేకి సిద్ధం కావాలి

సీతానగరం: మండలంలో ఫస్ట్‌ఫేజ్ రీ సర్వే పనులు పూర్తి కావస్తుండడంతో సెకెండ్‌ఫేజ్ 'రీ సర్వే పనులు చేయడానికి గుర్తించిన గ్రామాల్లో నిర్దేశించిన వీఆర్వోలు, వీఎస్‌ఏలు సమాయత్తం కావాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం హెచ్‌డీటీ ఎ.ఉమామహేశ్వర రావు, మండల సర్వేయర్ చంద్రశేఖర్ రావుల అధ్యక్షతన వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లా డుతూ మొదటి విడతగా పైలెట్ ప్రాజెక్ట్‌గా నిర్ధారించిన లచ్చయ్యపేటలో నిర్వహించిన 'రీ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేశారన్నారు. సెకెండ్ ఫేజ్ 'రీ సర్వే చేయడానికి గుర్తించిన నాలుగు గ్రామాల్లో అధికార సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

నేరాలను నియంత్రించాలి

- ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: నేరాలను నియంత్రించేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరు తెన్నులపై సంబంధిత పోలీసు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్, సాంకేతిక పరిజ్ఞానంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. నిందితులు కోర్టుకు హాజరయ్యేలాగా, ఎన్‌బీడబ్ల్యూ వారెంట్లు అమలయ్యేలా చూడాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ అంకిత సురానా, పాలకొండ డీఎస్పీ రాంబాబుతో పాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

సారాతో అనర్థాలు

సీతానగరం: సారా తాగి ప్రాణాలుపోగొట్టు కోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు సీతానగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న కొంకిడివరం గ్రామంలో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై సీఐ డి.పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గరుగుబిల్లి మండలం పరిధిలో సారా చూపిన ప్రభావంతో సీతానగరం మండలంలోని కొంకిడివరం, ఎస్ఆర్ పేట, ఉల్లిభద్ర, లఖనాపురం గ్రామాలను అధికారులు దత్తతీసుకున్నారని ఈ గ్రామంలో సారా విక్రయాల నిర్మూలనే లక్ష్యంగా రెవెన్యూ అండ్ పోలీస్ వారి సహకారంతో నిరంతరం నిఘాఉంచి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధికారులు నిర్వహించే గ్రామసభలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి, ఎస్సై

260 సారా ప్యాకెట్ల పట్టివేత



పట్టుకున్న సారా ప్యాకెట్లు చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: పట్టణంలోని ఎరుకులవీధిలో ముగ్గురు మహిళల దగ్గర 260 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించా మన్నారు. ఎక్కడైనా సారా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లు



బలిజిపేట వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

బలిజిపేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బలిజిపేట మండలంలో పాఠశాల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఆకట్టుకున్నాయి. అందులో భాగంగా వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు ప్రదర్శించారు. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటు చేశారు. మొక్కలు నాటండి-భూమిని కాపాడండి, కాంతి వనరు, క్లాప్ స్విచ్, జలచక్రం, మురుగునీరు శుభ్రం చేయు విధానం వంటి ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటుచేశారు. సైన్స్ ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతానగరం: బూర్జ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఉమిటీ సభ్యులు



పార్వతీపురం రూరల్: జాతీయ సైన్స్‌దినోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీతానగరంలో..

సీతానగరం: ఇంజినీరింగ్ పితామహుడు సర్ సీవీరామన్ జయంతిని పురస్కరించుకుని జరుపుకుంటున్న జాతీ సైన్స్ దినోత్సవం సీతానగరం మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు జోగింపేట కేజీబీవీలో ప్రిన్సిపాల్ జె.సంధ్య ఆధ్వర్యంలో మూడురోజులు నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఎంఈఓ జి.సూరిదేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు డ్రామా, పాటలు, డ్రాయింగ్, సైన్స్ ప్రయోగాల ప్రదర్శన పోటీలు జరిగాయి.

నిడగల్లులో..

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిడగల్లు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సైన్స్‌క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్‌ల ప్రదర్శన పోటీలు జరిగాయి. అలాగే బూర్జ, గాదెలవలస, మరిపివలస,ఆర్ వెంకంపేట, మండలకేంద్రంలోని హోలీక్రాస్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరిగింది.

చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదబొండపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మర్రాపు ఈశ్వరరావు మాట్లాడుతూ చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే విజ్ఞానశాస్త్రంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమావేశం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన అబ్దుల్ కలాంను ఉద్దేశించి చేసిన నృత్యాలు, మూ ధనమ్మకాలపై ప్రదర్శించిన స్కిట్ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: నిడగల్లులో రాకెట్ ప్రయోగాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



సీతానగరం: జోగింపేట కేజీబీవీలో మాట్లాడుతున్న ఎంఈఓ జి.సూరిదేముడు